# ప్రేమ స్వరూపం

డా. మోక్షగుండం గురుప్రసాదరావు

**ఓ** ప్రియా! నా ప్రియా!!

ఎలా ఉన్నావు నా ప్రియసఖీ! సౌఖ్యమా నా మనోహరీ! పదిలమా నా హృదయేశ్వరీ!!

ఏమీ ఎరుగని నా మనస్సులోని తమస్సుల్ని చీల్చి... ప్రణయపు ఉషస్సులు పంచావు...!

మధురమైన మమతలు పెంచావు!

దూరంగా... అస్పష్టంగా... అలవోకగా పయనిస్తున్న నా జీవన నౌకని, నీ స్నేహపు చుక్కానితో... రాగతీరాలకు మలిపావు...! వలపుల సారం తెలిపావు!

నా తప్త హృదయంలో వెన్నెల సోవలు ప్రవహింపజేస్తావని, నా అనితప్త జీవనంలో అనురాగ వేణువులూదుతావని... ఎంతగా ఆశతో అహరహమూ ఎదురు చూస్తున్నానో ఊహించగలవా!

నువ్వు వెళ్ళి ఐదు రోజులే అయింది. అయినా నాకు ఐదు యుగాలుగా అన్పిస్తోంది... నీకు దూరంగా... ఇంకా ఎన్ని రోజులు...

నాదేవీ! నన్ను 'నీ వచోమాధురిలో ముంచి, రాగ మాధుర్యం చూపి, అద్వితీయ సౌందర్యంతో 'జీవితం అంటే ఇంత తీయనిది' అన్న నిజాన్ని తెలిపి, నన్ను మరో కొత్త మనిషిగా తీర్చిన నా ప్రణయదేవిని... చూడకుండా ఉండటం నా వల్లకాదు. ఏ మాత్రం అవకాశం దొరికినా ఎగిరి రావాలని ఉంది.

మన విషయం మీ మామయ్యకి తెలిపి, మన పెళ్ళికి ముహూర్తం పెట్టించి, ఆ శుభవార్తతోనే నాకు జవాబు వ్రాస్తానని, అంతవరకు మీ ఊరికి నన్ను రావద్దని షరతు పెట్టావుగా!

నా ప్రియ ప్రేయసి మాటకు బద్ధుడనై ఉండాలనుకుంటున్నాను కాబట్టి లేఖలోనే నా ఊసులు...

ఊహలు... భావవీచికలు నాచెలికి చేరవేసి తృప్తిపడ్తున్నాను.

నీ కళ్ళ కాటుకల నీడలలో కదలాడ గలుగుతున్న నా అదృష్టానికి నేనెంతో మురిసిపోతున్నాను. నీ లోచనాల వెనుక మత్తుగా మెదిలే ఆలోచనలకు ఆలంబన నేనని పరవశంతో మేను మరచిపోతున్నాను.

చల్లని లాలన... నీ ఒడిలో నాకు లభిస్తుం దన్న కమ్మని భావన... నాలో మధురమైన ఊహలకు ఊపిరి పోస్తోంది.

సుమపేశలమైన నీ కౌగిలిలో సేద తీరాలని నా తనువు తపన పడ్తోంది.




అనుకున్నప్పుడు, అంతులేని ఆనందంలో మునిగిపోతున్నాను.

చిగురాకులలా చలించే నీ పెదవులు సమీక రించిన మధుధారలు... నా కోరికల తుమ్మెదల కోసమేనన్న ఊహ... నా హృదిలో మెదిలి... తనివారగా రాగ వార్ధిలో తేలియాడటానికై...

ప్రియ నెచ్చెలీ! వివాహ నౌకని సిద్ధం చేస్తున్నావని ఎదురు చూస్తున్నాను.

నాలో క్షణక్షణము నీ ఊహలే! కన్ను మూసినా తెరచినా కమనీయమైన నీ రూపమే!

నీ శుభవర్తమానానికై క్షణమొక యుగంగా నిరీక్షిస్తున్న...

నీ... వేణు

డాబాపై వెన్నెల వెలుగులో ఆ ఉత్తరాన్ని వందోసారి చదవడం పూర్తి చేసింది అపురూప.

మౌనిలా... గంభీరంగా... నిశ్చలంగా ఉండే వేణుగోపాల్‌ని తన చిలిపితనంతో కవ్వించి, కలికితనంతో అలరించి ప్రేమైక మూర్తిగా మలచుకొంది.

ప్రణయసాగరంలో కలల... అలలపై తేలియాడించింది. నిశ్చలమైన ప్రణయం నింపుకొని, జీవితాంతం కలిసి పయనిద్దాం. నిస్సందేహంగా ప్రణయమే మనమై ప్రవహిద్దాం అని బాసలు చేసుకున్నారు.

చదువు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేముందు వేణుతో 'శుభలేఖతో నీకు ఆహ్వాన ప్రణయలేఖ వ్రాస్తానంటూ' చెప్పి వచ్చింది.

తనను అపురూపంగా, ప్రాణప్రదంగా చూసుకునే మావయ్య తన మాట కాదనడని... తన నిర్ణయాన్ని తప్పక ఆమోదిస్తాడని, నీలాంటి వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎంచుకున్నందుకు ఎంతో ఆనందిస్తాడని వేణుతో నమ్మకంగా చెప్పింది.

మావయ్య గుర్తుకు రాగానే కళ్ళముందు గతం కదలాడింది.

★ ★ ★

తనకు మూడేళ్ళ వయసులో తల్లిదండ్రులు గోదావరి వరదల్లో మరణిస్తే... గుక్కపట్టి ఏడుస్తూ, ఆదరించేవాళ్ళు లేక అలమటిస్తూ తిరుగుతున్న తనని అక్కున చేర్చుకొని ఆదరించాడు.

మావయ్య కూడా ఆ వరదల్లో తనవారి నందర్నీ కోల్పోయి ఏకాకిగా మిగిలిన తరుణం లో నా పోషణ బాధ్యతను స్వీకరించాడు.

అప్పటికి అతని వయసు పదహారే!

వయసుకి మించిన పెద్దరికాన్ని తెచ్చి పెట్టుకొని, తను ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగిస్తూ, 'నెత్తికెక్కించుకుంటు న్నాడు' అని ఆయినవాళ్లు నిష్ఠూరాలాడినా లెక్కచెయ్యకుండా తన మనసు ఏమాత్రం నొచ్చుకోవడానికి తావివ్వకుండా... తన పేరుకు తగినట్లు అపురూపంగా కళ్ళలో పెట్టుకొని పెంచాడు.

డిగ్రీ చదువుతానంటే టౌనులో లేడీస్ హాస్టల్లో చేర్పించాడు. తర్వాత పి.జి. చేస్తానంటే అలాగేనని ఒప్పుకున్నాడు.

తాహతు లేదని ఏనాడు తన కోరికలు కాదనలేదు. తను కోరాలేగాని కొండమీది కోతి నైనా తెచ్చి ఇవ్వగలనని అంటూ ఉండేవాడు.

గంతకు తగ్గ బొంతను చూసి, పెళ్ళి చేసి పంపించక, ఎవరో అనాధ పిల్లని అంత గారాబం చేసి, మురుసుకుంటున్నా వెందుకని, ఊరి జనం వింతగా బుగ్గలు నొక్కుకొని, అబ్బురపడినా లెక్కచెయ్యలేదు.

గత పద్దెనిమిదేళ్ళుగా... అపురూప కోరిక ఏదీ అతను తిరస్కరించలేదు. ఆమె మనసులో మాట తెల్సిన వాడులా ప్రవర్తించేవాడు.

ఎంతో సంస్కారవంతుడిగా... వ్యవహార కర్తగా ఊళ్ళో అతనికి మంచి పేరుంది.

అలాంటి మావయ్యని ఒప్పించడం సమస్య

అవుతుందన్న ఊహ అపురూపకి లేదు.

★ ★ ★

''చదువు పూర్తయ్యిందా! ఇంకా చదవాల్సిందేమయినా ఉందా?'' అపురూప వచ్చిన నాలుగు రోజులకి అడిగాడు.

''అయిపోయింది మావయ్యా! ఇకపైన చదివే మూడ్ లేదు నాకు...'' పెరట్లో సన్నజాజి మొగ్గలు కోస్తూ అంది అపురూప.

''అయితే పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లేనా!''

''ఆహా...'' అంది ముఖంలో సిగ్గు దొంతరలు అతనికి కన్పించకుండా మల్లెతీగల మధ్య మొహం దాచుకుంటూ...

''ఎంత చదువుకున్నా ఆడపిల్లలకి పెళ్ళి మాట ఎత్తగానే అంత సిగ్గెందుకో...''

మరింతగా ఎర్రబారింది అపురూప వదనం.

''శుభశ్య శ్రీఘ్రం...'' నవ్వుతూ వెళ్తున్న మావయ్యని చూసి.

''ఎవరితో... ఏమిటి'' అని అడక్కుండా వెళ్తున్నాడు... వెళ్ళినంత వేగంగా తిరిగి వస్తాడు. వివరాలు కనుక్కోవడానికి నవ్వుకుంది అపురూప.

తర్వాత జరగబోయే అనూహ్య సంఘటనకి తను ఇచ్చిన గ్రీన్‌సిగ్నల్ నాందీ అవుతుందని ఆమెకి ఊహామాత్రంగా కూడా తెలియదు.

★ ★ ★

రెండ్రోజుల తర్వాత శుభలేఖ తెచ్చి, చేతిలో పెట్టిన మావయ్యవైపు విస్మయంగా చూసింది.

శుభలేఖ మడత విప్పింది...

ఆమెకు తెలియకుండానే కుడికన్ను అదిరింది...

అపశ్రుతి అలలా మదిలో మెదిలింది...

వధూ... వరుల పేర్లు చదివింది...

అంతే! కళ్ళు బైర్లు కమ్మాయి.

''చూశావా! నీ మనసులో మాట ఎలా అమలుపరిచానో...'' కోటి దీపాల కాంతులతో వెలిగిపోతున్న మావయ్య మొహంవైపు వెర్రిదానిలా చూసింది.

కలలో కూడా ఊహకందని విషయం... కళ్ళ ముందు కన్పిస్తుంటే... మాటలు రాని మూగదానిలా మారింది.

కళ్ళలో సముద్రం పొంగింది. తను పొరపడలేదుకదా... ఆశ చావక... మరోసారి శుభలేఖలోని వరుడి పేరువైపు చూసింది... 'చం..ద్ర...శే...ఖ...ర్...'' అది... అది... మావయ్య పేరు. మసక మసకగా కన్పించింది.

మాటా పలుకూ లేకుండా ఉండిపోయిన అపురూపని చూసి, ''ఏమిటలా

## ఏక్సిడెంటు

అనసూయ ప్రమాద భీమా చేయించాక ఆమెకు గర్భం వచ్చింది. ఇన్స్యూరెన్సు ఏజంటును కలిసి ''నేను ప్రమాద భీమా చేయించాను కదా. ఇప్పుడు గర్భం వచ్చింది. నా భీమా డబ్బు వచ్చేలా చూడండి'' అంది.

''గర్భం ఏక్సిడెంటు ఎలా అవుతుంది?'' కోప్పడ్డాడు ఏజంటు.

''ఇదీ ఏక్సిడెంటల్‌గా వచ్చిందే మరి'' అంది అనసూయ.

- పి. రాధిక (హంసపాగర)

అయ్యావు?'' ఆశ్చర్యంగా అడిగాడు...
మరేదో అనబోయిన అతను బయట్నించి ఎవరో పిలవడంతో వెళ్ళిపోయాడు.

వేణుని గురించి మావయ్యకి చెప్పకపోవడం తనదే పొరపాటు... ముహూర్తం పెట్టించ మన్నది కాని, ఎవరితోనో... పేరేమిటో చెప్పిందా! మావయ్యే ప్రశ్నిస్తాడని ఎదురు చూసిన తను...

మావయ్య మనసులోని మనసులోని మరో కోణాన్ని... ఏనాడూ ఊహించలేకపోయింది.

అపురూపంగా పెంచుకున్న గులాబీ మొక్క "అందమైన పువ్వు పూస్తే, అది తన నిరంతర శ్రమ ఫలితమేనని, తన స్వంతమేనని... ఆఘ్రాహించాలనుకోవడం తోటమాలిగా మావయ్యకి తప్పనిపించకపోవచ్చు...

వేణుగోపాల్ విషయం చెప్తే, మావయ్య భరించి తట్టుకోగలడా! మావయ్య గుండెలపై ఆడుకొని, ఆ గుండెని గాయం చేసి, నిర్దయగా, నిశ్చలంగా వెళ్ళిపోగలదా తను...!

తనకోసం ఏమైనా చెయ్యగల మావయ్య త్యాగాన్ని... ఆ కళ్ళల్లో కదలాడే మమ కారాన్ని... అనురాగంగా... ఆరాధనగా గుర్తించకపోవడం తన తప్పిదమేనేమో!

తన గుండె రాయి చేసుకొని, వేణుని మర్చిపోయి... మావయ్య మనసుకి ప్రతి స్పందిస్తే...

హృదయాన్ని దేవాలయంగా మలచి, దేవతగా తనను ప్రతిష్టించుకున్న వేణు... తన తిరస్కారాన్ని సహించి నిలువగలడా!

భగవాన్! ఎందుకిలా చిక్కు సమస్యలో బంధించావు నన్ను... ఆక్రోశించింది అపురూప మనసు.

★ ★ ★

ఆమె సమస్యతో సంబంధం లేనట్లు... కాల పురుషుని పయనం సాగిపోయింది మరో పదిరోజులపాటు.

అపురూప అభిప్రాయమై తిరిగి ప్రశ్నించలేదు ఆమె మావయ్య.

"అదేమిటయ్యా! కులమూ... గోత్రమూ లేని అమ్మాయిని నువ్వు చేసుకుం టున్నావు...'' ఊరి పెద్దమనుషులు నిలదీసిన మాటకి

"వేరే ఇంటికి ఇస్తే నా అపుని వాళ్ళు ప్రాణప్రదంగా చూసుకోగలరా! ఆమెని ఏ చిన్న మాటయినా అని అవమానిస్తే... నేను సహించలేను... అందుకే నానీడలో... నా గుండెలో పదిలంగా దాచుకుంటున్నాను.''

నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా మావయ్య చెప్పిన జవాబు విన్న అపురూప మనసు ఆర్ద్రమయింది.


తనమీద అంత మమతానురాగాలు పెంచుకున్న మావయ్య ఎదుట ఇక పెదవి విప్పలేకపోయింది.

మనసుని మౌనంగా జోకొట్టింది.

తనకు తానుగా వలచి, వలపించుకున్న వేణుని దూరం చేసుకోవడానికే నిర్ణయించు కుంది.

కానీ... మోసం చేసిన ప్రేయసిగా అతని మనసులో నిలచిపోకుండా తన సమస్య... ఈ పరిస్థితిలో తను తీసుకున్న నిర్ణయము... సవివరంగా ఉత్తరం వ్రాయాలని నిర్ణయించు కొంది.

★ ★ ★




''నేనలా చెరువు గట్టుమీదికి వెళ్ళొస్తాను మావయ్యా!'' చెప్పి బయలుదేరింది అపురూప.

తమ పొలంలో ఉన్న చెరుకు గట్టంటే ఆమెకి చిన్నప్పట్నించి ఉన్న ఇష్టం తెల్సుగనక.

''చీకటి పడేలోగా వచ్చెయ్యి! రోజులు మునుపటిలా లేవు మనూర్లో కూడా... ఆడపిల్ల ఒంటరిగా బయటికి వెళ్ళేలాలేవు. పాలేరు రాముడుని తోడు తీసికెళ్ళు...'' అన్నాడు.

''వాడు వద్దు... అతి వాగుడుతో నా మెదడు తినేస్తాడు. అర్ధగంటలో వస్తాను...'' సమాధానం కోసం ఆగకుండా వడివడిగా వెళ్ళిపోయింది.

చెరువు గట్టుమీద ఓ చదునైన నల్లరాతి బండమీద కూర్చుంది అపురూప.

ప్రకృతి అద్భుత సౌందర్యాన్ని సంతరించుకున్న శిశిర సంధ్యలో ఆమె మనసు సేద తీరింది...

ప్రశాంతమైన మనసుతో వేణుకి ఉత్తరం వ్రాసింది...

అప్పుడే చెరువుకు అవతలివైపు హద్దుగా ఉన్న కొండల్లో గాలి తిరిగింది.

ఆగాలి తాకిడికి చెరువులో నీరు అలలై చెలరేగింది. అలలు ఒడ్డును తాకి విరుగుతున్నప్పుడు వస్తున్న చప్పుడు మృదంగ ధ్వనిలా విన్పిస్తోంది.

గట్టుమీది చెట్లపైకి అప్పుడప్పుడే చేరుకుంటున్న తల్లి పక్షులు పిల్ల పక్షుల్ని కువకువలాడుతూ ముద్దులాడుతున్నాయి.

పగలంతా నిరంతరాయంగా వెలుగులు చిమ్మి అలసిపోయిన సూర్యుడు... సంధ్యాదేవిని కలుసుకోవడానికి వడివడిగా పడమటి కొండ వెనుకకు జారుకుంటున్నాడు.

ప్రకృతి సౌందర్యారాధనలో మునిగిపోయిన అపురూప రానున్న ప్రమాదాన్ని పసికట్ట లేకపోయింది.

వరిపొలానికి నీళ్ళు కట్టి వస్తున్న పాపిరెడ్డి దృష్టిలో పడింది అపురూప.

ఎప్పటి నుండో అపురూప అందాలపై

కన్నేసిన పాపిరెడ్డి, గత పంచాయితీ ఎన్నికల్లో చంద్రశేఖర్ చేతిలో ఓడిపోయినప్పటి నుండి... అతన్ని మానసికంగా ఎలా దెబ్బతీయాలా అని అదనుకోసం ఎదురు చూస్తున్నాడు.

అయాచితంగా లభించిన అవకాశాన్ని అతను వదలదల్చుకోలేదు... ఎన్నాళ్ళుగానో వేగుతున్న తనకోరికా, అతని మీద కక్ష్య తీరుతుంది.

చుట్టూ చూశాడు... ముసురుకుంటున్న చిరుచీకట్లలో... కనుచూపు మేరా ఎవ్వరూ లేరు.

సడిలేకుండా లేడిపై దాడి చేసేపులిలా... ఆమె వెనక్కి చేరి, భుజంమీద టవల్ని ఆమె నోట్లో కుక్కి... రెండు చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకొని, తన పంచేనిలాగి, గట్టిగా చేతుల్ని కట్టి పడేశాడు... ఊహించని సంఘటనకి సర్పదష్టలా... నిశ్చేష్టలా

గింజుకుంటున్న అపురూప మీద.. నిరంకుశంగా... దారుణంగా అత్యాచారం జరిపాడు...

తన టవలు... పంచె తీసుకొని స్పృహ కోల్పోయిన ఆమెని అలాగే వదిలేసి... మీసం మెలేసి... అక్కడ్నించి వెళ్ళిపోయాడు పాపిరెడ్డి.

ఆ దారుణకృత్యానికి మౌనసాక్షిలా ఉండటం ఇష్టంలేకనే కాబోలు, సూర్యుడు అప్పటికి అరగంట క్రితమే కొండల మాటుకి పారిపోయాడు.

★ ★ ★

స్పృహలో లేని అపురూపని పట్నం తీసుకొచ్చి, హాస్పిటల్లో చేర్పించి పది రోజులు గడిచిపోయాయి.

పదకొండో రోజు ఆమెకు స్పృహ వచ్చింది కానీ, శూన్యంలోకి పిచ్చి చూపులు చూస్తోంది.

అపురూప వేణుకి వ్రాసిన ఉత్తరం చదివిన చంద్రశేఖర్, మనిషిని పంపి, వేణుని పిలిపించాడు.

తమ పెళ్ళి విషయం తప్ప, జరిగిన దారుణం గురించి అతనికి చెప్పాడు.

అపురూపని చూసిన వేణుగోపాల్ సర్వసం కోల్పోయిన వాడిలా నిర్జీవంగా... మౌనంగా ఉండిపోయాడు.

రోజులు... వారాలూ గడచినా అపురూప పరిస్థితిలో మార్పు రాలేదు.

శారీరకంగా ఎటువంటి అనారోగ్యం లేదు. ఆమె మనసుకి తగిలిన షాక్ నించి తేరుకోవడానికి ఎంతకాలం పడ్తుందనేది... కాలమే నిర్ణయించాలి. ఆమెని మీరు ఇంటికి తీసుకెళ్ళవచ్చు...'' అన్నారు డ్యాక్టర్లు.

''మీరు రూపని మీ ఊరు తీసికెళ్ళండి. నేను మళ్ళీ వస్తానంటూ...'' చెప్పి వెళ్ళాడు వేణు.

అలా చెప్పినవాడు పదిహేన్రోజులయినా అయిపులేడు. ''అపురూపని వదిలించు కోవడానికే అతను రాకపోవడం... ఇదీ ఈ కాలపు యువకుల ప్రేమలు... అన్నీ సవ్యంగా ఉంటేనే ఆదరించి, అందలం ఎక్కించీ, ఊహల ఉయ్యాలలో... నీలి మేఘాలపై తేలియాడించేది... ఎక్కడయినా లోపం

కన్పించిందా... ఇక అంతే సంగతులు...''
విరక్తిగా నిట్టూర్చాడు చంద్రశేఖర్.

★ ★ ★

అతని అంచనాని తలక్రిందులు చేస్తూ మరుసటిరోజు, తల్లి, తండ్రిని వెంట పురోహితుడ్ని తీసుకొని కారులో వచ్చాడు వేణుగోపాల్.

''మీరు రూపకి దైవసమానులు. మీ సమక్షంలోనే రూపని నాదాన్ని చేసు కుంటాను...''

వేదమంత్రాల సాక్షిగా అపురూప మెడలో తాళి కట్టాడు వేణుగోపాల్... అతని చర్యలా ప్రేమ స్వరూపం ఆవిష్కృతమయింది.

''రూపని నావెంట తీసుకెళ్తాను. అక్కడ ఆమెని చూసుకోవడానికి... పెద్దడాక్టర్లకి చూపించుకోవడానికి అనువుగా ఉంటుంది.'' అంటూ చంద్రశేఖర్ పాదాలకు మొక్కాడు ఆశీర్వచనాల కోసం వేణుగోపాల్.

అతన్ని తక్కువ అంచనా వేసినందుకు సిగ్గిల్లాడు చంద్రశేఖర్... మౌనంగా ఆశీర్వ దించాడు.

మీరు ఒక్కరూ ఇక్కడ ఏం ఉంటారు. మాతోపాటు రూపని చూసుకుంటూ మా దగ్గరే ఉందురు రాకూడదా!'' అని అడిగిన అతని నిర్మలమయిన మనసుకి మనసులోనే జోహార్లర్పించి, సున్నితంగా అతని ఆహ్వానాన్ని తిరస్కరించి... మనస్ఫూర్తిగా వాళ్లకి వీడ్కోలు చెప్పాడు... చంద్రశేఖర్... కనుమరుగవుతున్న కారుకేసి కణ్వ మునిలా చూస్తూ.

★

